# దాక్షిణ్యాలోభం

## వా. స. మూర్తి

### 1

రైలు పోతోంది. పెట్టెలో చాలా ఉక్కపోతగా ఉంది. వేసవి కాలం. పైగా జనం క్రిక్కిరిసి ఉన్నారు. దానికితోడు పళ్లూ, బిస్కట్లూ, మందులూ, పుస్తకాలూ అమ్మేవాళ్ల బెడద. ఇక బిచ్చగాళ్లుకూడా తయారైతే జనం ఎక్కడ సహించగలరు? ఒక గుడ్డివాడు ఒక పిల్ల సాయంతో చిడతలు వాయిస్తూ, 'శివగోవింద గోవిందా' పాడుతూ ముందుకు సాగబోయాడు. కాని ఎవళ్ళూ దారిచేయలేదు. అందువల్ల వాడు తలుపుదగ్గరే నిల్చొని గోలపెడుతున్నాడు. ఒకరిద్దరు కాన్లు గిరవాటేశారు. పిల్ల ఏరుకుని గిన్నెలో పడవేసుకుంది. ఇంతలో మరొక ముష్టిది ఆ పెట్టెలోకే ఎక్కింది. గుడ్డివాడి పక్కన ఉన్నపిల్ల దానితో ఏదో కయ్యమంటోంది. తనుండగా తనకు పోటీగా మరొకతె రావడం ఇష్టంలేక గుడ్డివాడు మరీ గట్టిగా పాడుతున్నాడు. ఆ వచ్చినమనిషి వాళ్లను లెక్కచేయకుండా, "బాబయ్యా ధర్మం" అంటూ మొదలుపెట్టింది. రెండడుగులు ముందుకు వేసింది. దానితో అన్ని మూలలనుంచి ఒక్కసారిగా పెక్కుగొంతుకలు లేచాయి. "ఈ 'బెగ్గరీ' ఒక ప్రొఫెషన్ అయిపోయింది." "ప్రతివాడూ ముష్టే" "గాడుగేదెలా ఉంది పని చేసుకోకూడదూ?" "ఎందుకు చేస్తుందీ - తేరగా డబ్బులు దొరుకుతుంటేనూ" అంటూ ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ బయలుదేరిన వ్యాఖ్యానాలు విని ఆ ముష్టిది బిత్తరచూపులు చూస్తూ ఆగిపోయింది. ఏమనాలో తోచక కొంతసేపలాగే ఉండిపోయింది. కొందరి దృష్టి ఆమె శరీరం మీదకు పోకుండా ఉండలేకపోయింది. పడుచుదనం ఆకర్షణను చినిగిన గుడ్డలూ, చింపిరి జుట్టూ కప్పిపుచ్చలేకపోయాయి. ముష్టిది కొంచెంసేపటికి మళ్ళీ ధైర్యం తెచ్చుకొని "బాబయ్యా ధర్మం" అంటూ అడుగు వేయబోయింది. "నీకు కాదూ చెప్పేదీ - పనిచేసుకోకూడదూ దుక్కలానున్నావు" అన్నారు మళ్ళీ నలుగురూ. "పనే సేత్తానయ్యా, ఏదైన పనిసూపిత్తే" అంది ఆ ముష్టిది భయంతో. ఎవరూ మాట్లాడలేదు. అంతవరకూ తమాషా చూస్తున్న శంకరం మెల్లగా అన్నాడు: "అవునండీ పనిచేసుకోమన్నారు. పని చేస్తానంటోంది. ఏదన్నా పని చూపించండి మరి" "మా కెందుకయ్యా మధ్య" అని ఎవరిమట్టుకు వాళ్ళు నోళ్ళు కట్టేసుకుని కూర్చున్నారు. ముష్టిది శంకరంకేసి దేవుడికేసి చూసినట్లు చూసింది.

కాసేపటికి ముష్టిది మళ్ళీ మెల్లగా "బాబూ, ధర్మం" అంటూ ముందుకు సాగింది. ఇప్పుడెవరూ అడ్డగించడంలేదు. మౌనంగా దారి చేస్తున్నారు. ముష్టిది గొంతుక మరి కాస్త పెంచి అడుగుతోంది. డబ్బులు వస్తున్నాయి కొందరు కానులూ, అర్ధణాలూ, అణాలు వేస్తున్నారు. ముష్టిది మెల్లగా శంకరం దగ్గరకువచ్చి "బాబూ, ధర్మం" అంది. శంకరం ఆమెకేసి చూడలేదు కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు. "బాబూ, ఒక కానీ" అంది ముష్టిది, కొంచెం గట్టిగా. శంకరం ఆమెకేసి ఒక్కసారి చూసి మళ్ళీ తలతిప్పి కిటికీలోనుంచి బయటకు చూడసాగాడు. ముష్టిది ఆశ్చర్యంతో నిలబడిపోయింది. పెట్టెలో వాళ్ళొక్కసారిగా అందుకున్నారు: "ఏమండీ, ఇందాకా పెద్ద కబుర్లు చెప్పారే. ఇప్పుడొక కానీ పడేయరేం?" "కానీ ఏమిటి? దానిని సమర్థించినవారు కాబట్టి రూపాయి వేయాలి." శంకరం లోపలికి తిరిగి మిగతా వాళ్లకేసి నిర్లక్ష్యంగా చూసి ముష్టిదానితో అన్నాడు: "నేను ముష్టి వేయను. పని ఇస్తాను చేస్తావా?"

"చెయ్యకేం, బాబూ" అంది ఆమె.

"ఏం పని చేస్తావు?"

"ఏదైనా సరే, అయ్యాగోరూ."

"మా యింట్లో దాసీమనిషి లేదు. ఆ పని చేయగలవా?"

"సేత్తానయ్యగోరూ."

"అయితే ఎంత జీతం కావాలంటావు?"

"జీతమెందుకు అయ్యాగోరూ. ఇంత కూడూ గుడ్డా పెట్టే అంతే చాలూ"

"సరే అయితే ఇక నీవు బిచ్చమెత్తకు. నీకు కావలసినవి నేనిస్తాను. మా ఊరు తీసుకువెళ్తాను—నీ పేరేమిటి?"

"సుబ్బి, బాబుగోరూ."

శంకరం అక్కడ పండ్లవాడిదగ్గర అరడజను అరటిపళ్లు కొని నాలుగు ఆ మనిషికిచ్చి, రెండు గుడ్డివాడికిచ్చాడు తరువాత స్టేషనులో దిగి సుబ్బికికూడా టిక్కెట్టు కొనుక్కొనివచ్చాడు పెట్టెలోవాళ్లంతా శంకరంకేసి ఈర్ష్యతో అనుమానంతో చూస్తున్నారు. లోలోపల గుసగుసలాడడం మొదలుపెట్టారు. మెల్లగా ఇకిలింపులుకూడా బయలుదేరాయి. వాళ్ళ దృష్టి సుబ్బిమీదినుంచి శంకరంమీదికీ, శంకరంమీదినుంచి సుబ్బిమీదికీ పోతూఉంది కాని శంకరం ఇవేమీ గమనించలేదు. అతను తన ఇంటి విషయం ఆలోచిస్తున్నాడు అక్కడ దాసీమనిషి దొరకక భార్య చాలా ఇబ్బంది పడుతోంది. అన్ని పనులూ ఆమె చేసుకోవలసి వస్తోంది. భార్య అలా బాధపడుతూంటే శంకరం తనూ చాలా బాధపడ్డాడు కాని ఏమీ చేయలేకపోయాడు. ఈ వేళ అదృష్టవశాత్తూ ఈ మనిషి దొరికింది. ఇంత అన్నం పెడితే కావలసిన పనులు చేయించుకోవచ్చు. భార్య చాలా సంతోషిస్తుంది అని ఊహించుకుంటూ కూర్చున్నాడు.

### 2

అతని స్టేషను వచ్చేసింది. సుబ్బినికూడా దిగమని తను దిగాడు. సామాను పట్టించుకొని స్టేషను వెలుపలకు వెళ్ళాడు. అంతలో అతనికో సమస్య ఎదురైంది. ఇంటికెలా వెళ్ళడం? సుబ్బిని కూడా గుర్రపుబండిలో ఎక్కించుకు వెళ్తే భార్య ఏమనుకుంటుందో! నలుగురూ ఏమనుకుంటారో! గుర్రపుబళ్ళవాళ్ళూ "ఎక్కడికి తీసుకెళ్లమంటారు, బాబూ" అంటూ అతనిని చుట్టవేసి సామాను చేతిలోనుంచి లాగబోతున్నారు. కాని శంకరం సమస్యలో పడిపోయి అలాగే నిల్చున్నాడు. ఇంతలో సుబ్బే అంది "బండెందుకయ్యగోరూ. నేను పెట్టె మోసుకొత్తాను. నడిచిపోదాం"

# ★ దాక్షిణ్యా లోభం ★

ప్రతికించిం దనుకున్నాడు శంకరం. పెట్టె దాని నెత్తిమీద పెట్టి ఇంటికి నడిచాడు.

భార్య వచ్చి తలుపు తీసింది. కాళ్ళు కడుగుకుందుకు నీళ్లిచ్చి కుశల ప్రశ్నలన్నీ అడిగింది. శంకరం అన్నిటికీ జవాబు చెపుతూండగా సుబ్బి పెట్టె దింపి, బెదురుగా చూస్తూ నిలబడింది. శంకరం భార్య మీనాక్షి కూలిమనిషి ఇంతసేపు ఎందుకు నిలబడిందా అని ఆశ్చర్యపోయింది. "డబ్బివ్వలేదేమిటి, అలా నిలబడింది" అంది భర్తతో. శంకరం అన్నాడు: "నువ్వు పనిమనిషి లేక బాధపడుతున్నావుకదూ. అందుకోసం ఈమెను తీసుకువచ్చాను."

"పనిమనిషా? నిన్ననే ఒక మనిషి ఆరు రూపాయలకు కుదిరింది" అంది మీనాక్షి.

శంకరం నోట్లో పచ్చి వెలగకాయ పడింది. మీనాక్షి సుబ్బితో "నువ్వు వెళ్ళమ్మా—ఆ మనిషికి డబ్బులిచ్చి పంపేయండి" అంది మళ్ళీ భర్తవైపు తిరిగి. సుబ్బి శంకరంకేసి తెల్లబోయి చూస్తోంది. శంకరం మీనాక్షికేసి చూస్తున్నాడు. కొద్దిసేపటికి తేరుకొని భార్యను ప్రతిమాలాడు: "ఆ మనిషిని మాన్పించేయి మీనా. పాపం ఈ మనిషికి తప్పక పని చూపిస్తానని ఆశపెట్టి తీసుకువచ్చాను. ఇలా పంపించివేస్తే బాగుంటుందా."

"నిన్న పనిలో చేరినదానిని ఈ వేళ మానేయమనడంమాత్రం బాగుంటుందా?"

"ఎలాగో అలాగ మాన్పించు. మీనా ఈమనిషినే పెట్టుకో."

"ఎలా మాన్పించనూ? - పోనీ ఈమనిషేమైనా తక్కువకు కుదిరితే అలాగే చేయవచ్చు. ఏమమ్మా, ఇంట్లో అంట్లూ చెంబులూ తోమి, రెండుపూట్లా కసువు చిమ్మి, బట్టలుతికి ఆరబెట్టి, పక్కలు వేసేందుకు ఎంత పుచ్చుకుంటావు? ఇంకొక మనిషి ఆరురూపాయిలకు చేస్తోంది. అంతకన్న తక్కువకు చేస్తానంటే నిన్ను కుదుర్చుకుంటాను. లేకపోతే నువ్వు నీదారిన వెళ్ళిపోవచ్చు" అని స్పష్టంగా చెప్పింది మీనాక్షి పెద్ద వ్యవహారవేత్తలా.

సుబ్బికి ఏం జవాబు చెప్పాలో తెలియక శంకరంకేసే చూసింది. శంకరం గొంతుక సవరించుకొని చెప్పాడు. "ఈ మనిషికి డబ్బులియ్యనక్కర్లేదు మీనా. ఇంత అన్నం పెట్టి బట్టలిస్తే కావలసిన పనులన్నీ చేయించుకోవచ్చు. మనిట్లోనే ఉండి చేస్తుంది."

"బాగుంది ఆరురూపాయలకు కావలసిన పనులన్నీ చేస్తూంటే రెండుపూటలా అన్నంపెట్టి బట్టలివ్వడమెందుకూ, దండగ! అన్నం బట్టలూ అంటే ఊరికే ఉందనుకున్నారా" అని ఆగి మళ్లీ "అసలు ఈ మనిషంటే ఏమిటి ఇంత ఇదవుతున్నా"రంది మీనాక్షి గట్టిగా.

శంకరం పని ఇరకాటంలో పడింది. "కాదుమీనా. పాపం ఈమనిషి చూసేవాళ్ళెవరూ లేక ముష్టెత్తుకుంటూంటే జాలిపడి తీసుకువచ్చాను -" అకస్మాత్తుగా అతనికొక ఉపాయం తోచింది. ఇటు చూడు మీనా నలుగురిళ్లల్లో పనిచేసేవాళ్ల చేత చేయించుకునే కన్న ప్రత్యేకంగా ఒక దాసీచేత చేయించుకోవడం గొప్పగా ఉండదూ? అన్నాడు.

ఉపాయం ఫలించింది. తమకు ప్రత్యేకంగా దాసీఉంటే ఇరుగుపొరుగు అమ్మలక్కలలో తాను గొప్పతనం పొందవచ్చునని తోచింది మీనాక్షికి. "సరే తెచ్చిపడేసేవారికి మీకే భారంగా తోచనప్పుడు మధ్య నాకెందుకు. - ఇదిగో నీ పేరేమిటన్నావు" అని అడిగింది సుబ్బిని. సుబ్బి చెప్పింది. "సరేసుబ్బీ పోయి ముందు దొడ్లో అంట్లుతోము. తరువాత అన్నం పెట్తాను" అంటూ వంటింట్లోకి నడిచింది మీనాక్షి. సుబ్బి దొడ్లో అంట్లు తోమడం మొదలుపెట్టింది.

## 3

ఒకటి రెండురోజులు శంకరానికి సుబ్బి విషయం కనుక్కోవడానికి తీరిక లేకపోయింది. తరువాత గమనించగా భార్య మహారాణీవైభోగం అనుభవిస్తూ సుబ్బిచేత అన్ని చాకిరీలు చేయించుకుంటోందని తెలిసింది. మీనాక్షికి ఇప్పుడు ఇటుపుల్ల అటు పెట్టడానికికూడా ఒళ్లు వంగడం లేదు. అవును సొంతదాసీ ఉన్నప్పుడేనా అనుభవించకపోతే ఇంకెందుకు అనే ధోరణిలో ఉంది ఆమె. సుబ్బిమాత్రం ఏమాత్రం విసుగుకోకుండా యజమానురాలు చెప్పిన పనులన్నీ చేస్తోంది. చకచకా చేసివేస్తోంది. కాని ఆమె పనులు త్వరత్వరగా చేసినందుకు తీరుబడి లభించకపోగా మరిన్ని పనులు పైన పడుతున్నాయి. అయినా కిమ్మనకుండా చేస్తూనేఉంది. ఆమె ఇంతలా చేస్తున్నా మీనాక్షి గొంతుచించుకోడంమాత్రం మానలేదు. అధికారం చూపించుకునే ఈ సదవకాశాన్ని ఊరికే పోగొట్టుకోదల్చుకోలేదు మీనాక్షి. ఇదిమూసి శంకరం చాలా బాధపడ్డాడు. అన్నాని కాశపడి వచ్చినంతమాత్రాన బానిసగా చూసుకోవడమా. కాని భార్యకు ఈవిషయం నచ్చజెప్పడం చాలా కష్టం. ఎప్పుడో మంచి అవకాశం లభించినప్పుడు మెల్లగా చెప్పి చూడాలనుకున్నాడు.

భోజనాలయినతరువాత రేడియో పెట్టూ కూర్చున్నాడు శంకరం. భార్య చాపమీద కూర్చొని తమలపాకులు చుట్టి అందిస్తోంది. పిల్లలు ఇంకొక గదిలో పాఠాలు చూసుకుంటున్నారు. శంకరం వాళ్ళూ కూర్చున్న గదిగుమ్మం ఇవతల ప్రక్కగా నిల్చొని సుబ్బి రేడియో వింటోంది. రేడియోలోమంచిపాటవస్తోంది. కొద్దిసేపు తరువాత మీనాక్షి సుబ్బి అక్కడ నిలబడిఉండడం గమనించింది. "సుబ్బీ, పోయి ముందు పక్కలు వేయి" అని కేకవేసింది. "అలాగేనమ్మా" అంటూ వెళ్లిపోయింది సుబ్బి. "ఉండు సుబ్బమ్మా", అన్నాడు శంకరం. భార్యవైపు తిరిగి "కాసేపు రేడియో విననియ్యి. పక్కలు తరువాత వేయవచ్చు" అన్నాడు. మీనాక్షి ఒక్కసారి అతనికేసి చురచురా చూసి, "రేడియోకేం, ఎక్కడికీ వెళ్లదుగదా, ముందు పక్కలు వేయనీయండి. పోవే సుబ్బీ" అంది. "అలాగేనమ్మా" అంటూ సుబ్బి వెళ్ళిపోయింది. శంకరం ఒక్కక్షణం తటపటాయించి గొంతుక సవ

"ఆడవాళ్ల దగ్గర రహస్యాలు దాచి లాభం లేదు. అందుచేతనే నెప్పుడూ దాచను. మా యింట్లో మేము ప్రశాంతంగా ఉన్నది అందువల్లనే"

"అవును ఆడవాళ్ల దగ్గర రహస్యాలు దాచి లాభంలేదు. అందు చేతనే నేనూ ఎప్పుడూ దాచను. కాని మా యింట్లో అన్ని చిక్కులూ వచ్చి పడుతున్నది అందు వలననే"

* * *

"మీ ఆయనకు ఈ విషయం అన్ని విధాల నచ్చచెప్పావా?"

"ఆ! కావాలంటే ఇలా వచ్చిచూడు. పొట్ట పడని బొచ్చొ ఒక్కటన్నా ఉన్నదేమో!"

రించుకొని మెల్లగా అన్నాడు: "పాపం కాసేపు కూర్చోనీయకూడదూ? ఎప్పుడూ పనేనా?" మీనాక్షి మూతివిరిచేసుకుంది. "ఏమిటి దానిని నేను ఎప్పుడూ పనితో చంపేస్తున్నానా? తేరగా మేపడానికా తీసుకువచ్చారు? అన్నం పెట్టి, బట్టలు ఇచ్చేటప్పుడు ఈమాత్రం పని చేయించుకోకుండా ఎవరుంటారు?" అంటూ పెద్ద గొంతుకతో మొదలు పెట్టింది. శంకరం కంగారుపడ్డాడు. "కాస్త గొంతుక తగ్గించు మీనా. నువ్వు సుబ్బమ్మని కోసి పెట్టున్నా వని నే ననడం లేదు. ఆమె ఎదురుచెప్పడం లేదుకదా, ఏమి చేయమంటే అది చేస్తూనే ఉందికదా, అలాంటప్పుడు కాస్త మెల్లగా చెప్పి చేయించుకోమనే నే ననేది" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. మీనాక్షి గొంతుక తగ్గే బదులు మరి కాస్త పెరిగింది. "అయితే దానిని నేను కసిరి కొట్టున్నాననేగా మీ రనేది. ఆ పనిచేయమనీ, ఈ పని చేయమనీ చెప్పడం కూడా తప్పేనా? బ్రహ్మరాక్షసి గొంతుకతో అరుస్తున్నానా?"—అంటూ ఆగి మళ్లీ భర్త కేసి తీక్ష్ణంగా చూస్తూ అడిగింది. "అసలు మీకు దానిమీద ఇంత అభిమాన మేమిటి? ఎక్కడో అడుక్కుతినేదాన్ని తీసుకురావడమూనూ, దాన్ని రాణిగారిలా చూడాలనడమూ—ఈ వరసేమిటో నాకు బొత్తిగా బోధపడడం లేదు." శంకరం నివ్వెరపోయాడు. తరువాత తేరుకొని "నీ యిష్టం వచ్చినట్లే జరగనీయి, మీనా, నేను కాదనను" అంటూ వెంటనే వేరొక విషయానికి మళ్ళించివేశాడు భార్య దృష్టి.

## 4

మీనాక్షి ఎప్పటిలా సుబ్బిని గొంతుక పెట్టుకొని చలాయిస్తూనే ఉంది. మీనాక్షి కేకలను ఏమీ అనుకోవద్దని పోనీ సుబ్బితోనే చెబుదా మనుకున్నాడు శంకరం. పాపం ఏం బాధపడుతోందో సుబ్బి. కాని ఒక్కమాట పైకి రానీయడం లేదుకదా.

ఆ వేళ మధ్యాహ్నం భార్య దొడ్లో కూర్చొని ఇరుగు పొరుగు అమ్మలక్కలతో కబుర్లు చెపుతూ కూర్చుంది. సుబ్బి ఇల్లు ఊడుస్తోంది. అన్ని గదులూ అయినతర్వాత శంకరం గదిలోకి వచ్చి తుడుస్తోంది. అతను ఏదో రాసుకుంటూ ఆగి మెల్లగా అడిగాడు "ఏం, సుబ్బమ్మా, ఇక్కడ బాగానే ఉంటోందా?" "బాగా ఉండకేం బాబూ, నేను జనమలో ఈమాత్రం సుఖ మెరుగుదునా" అంది సుబ్బి.

"అమ్మగారు కాస్త కరుకుగా మాట్లాడితే ఏమనుకోకేం" అన్నాడు శంకరం.

"అదేం టయ్యగోరూ! ఎందు కనుకుంటాను? అమ్మగారు చాలా మంచోరు. ఇది వరకు నే నెరుగున్న చాలా అమ్మగార్లకన్న మీనాచ్చమ్మ ఎంతో నయం," అని మీనాక్షినే సమర్థించింది సుబ్బి.

"అయితే నీకు దగ్గరవాళ్ళవరూ లేరా—ఇలా ఇంటి మాటేనా తలపెట్టకుండా ఉంటున్నావు?"

"మాకు ఇళ్లేంటి అయ్యగోరూ? మా అమ్మ కలరా తగిలి సచ్చిపోయింది. తరువాత మా అయ్య మరొకత్తెను చేరదీశాడు. రోజూ తాగొచ్చి దాన్నీ,నన్నూ కొట్టుంటే ఆఖరికి పడలేక పారిపోయొచ్చా నయ్యగోరూ."

ఇంతలో దొడ్లోనుంచి సుబ్బీ అని కేక వినిపించింది. "వస్తుండానమ్మ" అంటూ సుబ్బి పరుగెత్తుకుపోయింది.

సుబ్బిని గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు శంకరం. ఇంతవరకు ఎన్నడూ సుబ్బి దీనావస్థలో ఉన్న ఒక మనిషి అనే తప్ప వేరుభావం ఉండేదికాదు. కాని ఈ వేళ ఆమెతో మాట్లాడుతూంటే ఆమె నిండు పడుచుదనంలో ఉన్న స్త్రీ అనే భావం చటుక్కున కలిగింది. అటువంటి భావం కలిగినందుకు అతను తన కుర్రతనపు బుద్ధికి తానే నవ్వుకున్నాడు. కాని నవ్వుకున్నంత తేలికగా పోలేదా భావం. వల దనుకున్నా పదే పదే స్ఫురణకు రాజొచ్చింది. అదిమొదలు అతను అనుకోకుండానే సుబ్బివంక చూస్తూఉండి పోతున్నాడు. ఆమె ప్రతి కదలికా అతని దృష్టిలో ముద్రితంకాసాగింది. ఒకటి రెండు మార్లు అతను అలా చూస్తూంటే సుబ్బి దృష్టితో కలవడం సంభవించింది. వెంటనే సుబ్బి పమిట సవరించుకొని సిగ్గుతో తల వంచేసుకుంది. అత నున్నచోటికి ఎప్పుడన్నా రావలసివస్తే బెదురుగా చూస్తూ వస్తోంది. సుబ్బి తన ఎదురుగా ఉండి పని చేసుకుంటూంటే, ఆమెతో తను మాట్లాడుతూంటే బాగుండు ననిపించసాగింది శంకరానికి. కాని ఛ, ఛ ఇవేమిటి తన కిలాంటి ఆలోచనలేమిటి అని మనస్సు మరల్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సుబ్బి మీనాక్షినే సమర్థిస్తోంది ఆమె ఎంత అధికారం చలాయించినా. ఆమెవల్లే తాను బ్రతుకుతున్నట్లుగా ఉంటోంది. కాని కృతజ్ఞతాపూర్వకంగా తనతో ఒక్కమాటడాకూ అనలేదే! అయ్యగారి దయవల్లే నా బ్రతుకని ఒక్కసారి అంటే! ఒక్కసారి ఆ కళ్లలోనుంచి కృతజ్ఞతా భావం ప్రకటిస్తే! సిగ్గువల్లే చెప్పలేకపోతోందేమో! అవును, సుబ్బి పడుచుది - అరెరే మళ్ళీ బుద్ధి అలాగే పోతోందే అని జుట్టుపీకుకొని రాత కాగితాలవైపుకు దృష్టి మరల్చేవాడు శంకరం.

> రెండో భార్య ఎంత చేసినా తృప్తి పడక పోవటం, అస్తమానం మొదటి భార్యను పొగడటం అతనికి ఒక దురలవాటై పోయింది. ఒకనాడు విసుగు పుట్టి భార్య అన్నది.
>
> "ఇద్దరం మిమ్మల్నే పెళ్లి చేసుకున్నాం కదా! అలాటప్పుడు మా అక్కగారు తెలివి తేటలలో ఎలా ఎక్కువదో నాకు అర్థం కావటం లేదు."

దసరాకు భార్యకుమంచి జరీ చీరలు రెండూ, పిల్లలకు చొక్కాలూ, లాగుగుడ్డలూ, తనకు కొత్తబట్టలు వగైరాలు తెచ్చాడు శంకరం. మీనాక్షి అన్ని పొట్లాలూ విప్పి చూసి చివరికి సన్నగళ్ల నీలం చేనేతచీర చూసి ఇదెవరికంది. "సుబ్బికికూడా ఇద్దామని తెచ్చాను. పండుగకదా పాపం కట్టుకొంటుంది" అన్నాడు శంకరం, సుబ్బికేసి ఓరగా ఒకసారి చూసి. "ఇప్పుడే కొత్తచీర ఎందుకులెండి. ప్రస్తుతానికి నేను కట్టి విడిచిన వాయిల్ చీర ఇస్తాను - ఆ చక్రాల చీర ఇస్తాను కట్టుకుంటావుగదూ, సుబ్బీ" అంది మీనాక్షి ఆమెవైపుకు తిరిగి. "ఏదీ? - చక్రాల చీరనా అమ్మగోరూ! అదే నాకిస్తారా" అంది సుబ్బి, తనకు గొప్ప భాగ్యం అబ్బబోతున్నట్లుగా చూస్తూ. మీనాక్షి చక్రాలవాయిల్ చీర యిచ్చింది. అది కట్టుకొని పొంగిపోయింది సుబ్బి. శంకరానికి చాలా బాధ కలిగింది. మళ్ళీ మీనాక్షికే దక్కింది గౌరవమంతా. తను కొత్తచీర కొనితెచ్చానన్న మాట కూడా గుర్తులేనట్లుంది సుబ్బికి! కాని ఆ చక్రాల వాయిల్ చీరే బాగుందేమో! ఆచీర కట్టుకుంటే సుబ్బి ఎంతబాగుంది.— అబ్బ, ఇవేమిటి పాడు ఆలోచనలు!!—

ఆవేళ సాయంత్రం కొంచెం పెందరాళే ఇంటికి చేరాడు శంకరం. ఇంట్లో సుబ్బి ఒకత్తే ఉంది. మీనాక్షి పిల్లలూ ఎవరో స్నేహితులింటికి వెళ్ళారు. సుబ్బి ఒకత్తే ఉంది! అతని హృదయం గబగబా కొట్టుకోసాగింది. ఉద్రేకపు పొంగులో వివేచన కొట్టుకుపోయింది. కొంచెంసేపు దూరం నుంచి సుబ్బికేసే చూసి చూసి మెల్లగా

# దాక్షిణ్యాలోభం

వణుకుతున్న కంఠంతో "సుబ్బీ" అని పిలిచాడు, ఎన్నడూ సుబ్బీ అని పిలవనివాడు! "ఎందుకు, బాబుగోరూ" అంటూ ఎదుటికి వచ్చి నిలబడింది సుబ్బి కొంచెం భయంతో, కొంత అర్థంకాక చూస్తూ. "సుబ్బీ అమ్మగారు బాగా చూస్తున్నారా?" ఎన్నో సార్లు అడిగిన ప్రశ్నే - కాని కొత్తగొంతుకతో. "చూడకేం బాబుగారూ, అమ్మగారంత మంచోరు లేరు" అంది సుబ్బి ఎప్పటిలాగానే. "అమ్మగారే మంచివారు, అయ్యగారు మాత్రం?" అని శంకరం అంటూండగా "అదేమిటి అయ్యగారూ, మీవల్లే కదా ఇలా బతుకుతున్నది. మీరు కనికరించబట్టేకదా" అంది సుబ్బి.

"నేను నీకు కొత్తచీర కొన్నాను తెలుసా?"

"అవును బాబూ. నాకోసం మీరెంత జాలిపడుతున్నారయ్యగోరూ!"

"సుబ్బీ" అంటూ చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాడు శంకరం. ఆమె ఒక్క క్షణం నిశ్చేష్టురాలైపోయింది. "బాబుగారూ, ఇదేంపని ఎవరేనా సూత్తారు! వదిలేయండి అయ్యగారు" అంటూ గింజుకులాడింది. కాని ఆమెదీ పొంగే రక్తమే. మరునిమిషమే లొంగిపోయింది.

## 5

ఉద్రేకం శిఖరాలనుంచి పశ్చాత్తాపం అగాధాలలోకి పడిపోయాడు శంకరం. అంతవరకూ ఉన్న ఉడుకు చల్లారగానే తానెందుకు అలా ప్రవర్తించానా అన్న ఆశ్చర్యం మిగిలింది. తనపని తనకే అసహ్యం కలిగింది. తన మొగంచూసి మీనాక్షి తన సంగతి గ్రహించి వేస్తుందేమో నని భయం బయలుదేరింది. మీనాక్షి కళ్ళలోకి చూడలేక తలవంచుకు తిరుగుతున్నాడు. కాని మీనాక్షి ఏమీ విశేషం గ్రహించలేకపోయింది. ఎప్పటిలాగే చరిస్తోంది. కాని వచ్చినమార్పల్లా సుబ్బిలోనే!

ఎన్నడూలేనిది ఆవేళ సుబ్బి నిలువుటద్దం ముందు నిల్చొని తన ప్రతిబింబం చూసుకుంటోంది. జుట్టు నొక్కుకొంటూ, చీర సవరించుకొంటూ కళ్ళు అనేకవిధాలుగా త్రిప్పి చూసుకుంటోంది. అప్పుడే శంకరం అటువచ్చాడు. అప్పుడే దొడ్లోనుంచి "సుబ్బీ" అని మీనాక్షి కేక వినిపించింది. "వస్తున్నానమ్మా" అంటూనే సుబ్బి మరి రెండుక్షణాలు అద్దంలో చూసుకొని శంకరం కేసి ఓరగా చూసి నవ్వి వెళ్ళిపోయింది. ఆనవ్వు చూసి శంకరం గజగజలాడిపోయాడు. కొంపతీసి ఎప్పుడేనా మీనాక్షి ముందే తన కేసి అలా చూసి నవ్వుతుందేమో! ఇప్పుడా నవ్వులో అతనికి ఆకర్షణ ఏమీ కనబడంలేదు. భయం, వెగటూ మాత్రం కలుగుతున్నాయి. అందుకే శంకరం సుబ్బికేసి చూడకుండా తల తిప్పేసుకుంటున్నాడు. అయినా అప్పుడప్పుడు సుబ్బి తనకేసే చూస్తున్నట్టుగా తెలియకపోలేదతనికి. సుబ్బి ఇదివరకుకన్న ఎక్కువసేపు అతనున్న గదిదగ్గరే తారట్లాడుతోంది. ఏదో వంక పెట్టుకొని ఆగదిలోకి పదేపదే వస్తోంది. కాని శంకరం ఆమె ఎదటపడకుండా ఉండడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

సుబ్బి ఇదివరకటిలా చకచకా పని చేయడంలేదు. ఏదో ఆలోచనలో పడి కూర్చుంటోంది. మీనాక్షి పిలిస్తే వస్తున్నానంటూనే కదలదు. మీనాక్షి అడిగితే "పని చేస్తూనే ఉన్నానుకాని ఊరికే కూర్చోలేదు కదా, అప్పుడే అంత కొంపమునిగి పోతుందా" అని సణుగుతోంది. పనిచేస్తూకూడా విసుక్కుంటూ ఏదో లోలోపల గొణుగుకుంటోంది. ఎలాగో అలాగ శంకరం కంట పడడానికి, అతనికేసే చూస్తూ ఉండడానికీ ప్రయత్నిస్తోంది.

నాలుగురోజులు గడిచినతర్వాత సుబ్బి మీనాక్షి చెప్పే పనులు అన్నీ చేయనంది. "చేతులు నొప్పి పెడుతున్నాయి కాని ఈ పనులకు అంతే లేదు" అని గట్టిగానే అనేసింది. "మరి తేరగా అనుకున్నావేం?" అని కోపంతో గొంతుక చించుకుంటూ అడిగింది మీనాక్షి.

"నేను తేరగా తినడమూ లేదూ, మీరు తేరగా పెట్టడమూలేదు. చాకిరీ చేస్తూంటే పెడుతున్నారు. ఊరికే ఏమీ పెట్టడంలేదు" అని పెళుసుగా జవాబిచ్చింది సుబ్బి. మీనాక్షి ఆశ్చర్యంతో నిలబడిపోయింది. సుబ్బేనా ఇలా మాట్లాడుతున్నదీ! తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందట! మీనాక్షి కోపం పట్టలేకపోయింది. బహుశా తేరగా తిండితిని బలిసేసరికి సుబ్బికి సోమరిపోతుతనం ఎక్కువైంది అనుకుందే కాని ఈ మార్పుకు అసలు కారణం ఊహించలేకపోయింది మీనాక్షి. సుబ్బిలో సోమరిపోతుతనం వదిలించివేయడమో లేక సుబ్బినే వదిలించివేయడమో ఏదో ఒకటి జరగాలని నిశ్చయించుకుంది. "ఇంత కాలం తిని ఇప్పుడు నాకెదురు చెప్తావా? నేను చెప్పినట్లు నోరెత్తకుండా చేస్తే చేయి. లేకపోతే ఈక్షణం ఈ ఇంట్లోనుంచి బయటికి నడు. నిన్నే మీ బ్రతిమాలవలసిన గతి మాకు పట్టలేదులే. నువ్వు పోతే లక్షమంది ఉన్నారు ఈ పని చేయడానికి, ఏం?" అంది మీనాక్షి, తన అధారిటీ అంతా వ్యక్తంచేస్తూ.

(49-వ పేజీ చూడండి)

అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు, అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ, కాళ్లు లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్ట కుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టిరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. రు. 1/-

ఇండియన్ మెడికల్ హౌస్

లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.

★ విచిత్ర వ్యక్తి ★

మూలం: మార్క్ ట్వేన్

అనువాదం: నండూరి రామమోహనరావు

వెల రూ. 1-8-0

పోస్టు ఖర్చులు ప్రత్యేకం

ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1.

## ★ దాక్షిణ్యాలోభం ★

(10-వ పేజీ తరువాయి)

"అయ్యగారు నన్ను తీసుకువచ్చారు. అయ్యగారు పొమ్మంటేనే పోతాను" అని ఖచ్చితంగా చెప్పివేసింది సుబ్బి. మీనాక్షి ఒక క్షణం స్తంభించిపోయింది. తన ఇంటి దాసి తన్నెదిరించడమే! తననే చులకన చేయడం! "పోతావా పోవా" అని అరిచింది మీనాక్షి కంపిస్తున్న పెదవులతో.

"అయ్యగారు పొమ్మంటేనే పోతానని చెప్పానుకదా, అమ్మగారూ" అంది సుబ్బి చలించకుండా.

మీనాక్షి భర్తదగ్గరకు పరుగెత్తింది. "నేను మొదట్లోనే చెప్పలేదూ, దానిది గడ్డి తినే బుద్ధి అని. తిన్న యింటి వాసాలు లెక్కపెట్టే బుద్ధి! దానిని ఇక ఒక క్షణం ఇంట్లో ఉండడానికి వీలు లేదు. నేను పొమ్మంటే పోదట! మీరు పొమ్మనాలట. నేనంటే దానికంత అలుసయిపోయాను కాబోలు! పాపిష్టిముండ! దానిని జుట్టు పట్టుకొని అవతల కీడ్చేస్తారా లేదా" అంటూ ఆడపులిలా గాండ్రించింది మీనాక్షి.

శంకరం బెల్లం కొట్టిన రాయిలాగా మాట్లాడకుండా నిలబడిపోయాడు ఒక్కసారి సుబ్బికేసిచూసి తలవంచేసుకున్నాడు. సుబ్బి అతనికేసి సూటిగా చూసింది—ఏం జవాబు చెప్తారు, నన్ను పొమ్మనగలరా—అని అడుగుతున్నట్లు.

"ఏమండీ మాట్లాడరేం? నేను పొమ్మంటే పోదూ! నే నెవత్తె ననుకుందో! ఏం, దాన్నీ క్షణం జుట్టుపట్టుకు ఈడ్చేస్తారా లేక నేను పుట్టింటికి వెళ్లిపోనా?" అని మళ్లీ ఉరిమింది మీనాక్షి. శంకరం పని అడకత్తెరలో పోకచెక్కలా అయింది. ఏమనాలో అతనికితోచడంలేదు. ఇంతలో సమయానికి దేవుడిలా ఎవరో వీధిలోనుంచి "శంకరం" అని కేక వేశారు. బ్రతుకుజీవుడా అనుకుంటూ శంకరం వీధిలోకి పరుగెత్తాడు.

శంకరానికి సుబ్బితో వెళ్ళిపొమ్మని చెప్పనే అక్కర్లేకపోయింది. ఆమె ఆ రాత్రే ఎవరితోనూ చెప్పకుండా వెళ్లిపోయింది. మర్నాడు పొద్దున్న వెతుక్కున్న తర్వాత తెలిసింది ఆమె వెళ్ళిపోయిందని. మీనాక్షి కించితైనా చింతించలేదు సరికదా పీడా వదిలిపోయింది అని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచింది. కాని పోయేది చేతిలో ఏమైనా పట్టుకుపోలేదు కదా అని అనుమానం వేసి కంగారుగా అన్ని గదులూ చూసుకుని, అన్నీ ఉన్నాయి అని మనస్సు కుదుటబరుచుకుంది. కాని భార్య మాట వినేసరికి శంకరానికి ఎందుకో అనుమానం తోచింది. పెట్టె చూసుకున్నాడు. అరె! రైతు లంతకుముందురోజు ఇచ్చిన ఆరు వందలేవీ? పెట్టె అంతా తిరగవేసి చూశాడు. అలమారా చూశాడు. చొక్కాజేబులూ, కోటుజేబులూ అన్నీ తడిమాడు. ఎక్కడా కనిపించలేదు. ఆరు వందలూ! పెట్టెలోనే పెట్టినట్లు తనకు పూర్తిగా జ్ఞాపకం. అతను వెతుక్కుంటూంటే మీనాక్షి అడిగింది "ఏమిటి, దేనికోసం వెతుకుతున్నారు" అని. "ఆఁ ఏమీ లేదు కళ్ళజోడుకోసం" అనేశాడు శంకరం కళ్లజోడు ఎదురుగా అలమారాలో ఉండగానే.

మర్నాడు మీనాక్షి అడిగింది అతనిని రైతులిచ్చిన ఆరు వందలూ బాంకులో కట్టేశారా అని. కట్టేశానన్నాడు శంకరం. అనక మరి ఏం చేయగలడు?

అందుకే ఏటి ఒడ్డున రావిచెట్టు నీడన కూర్చుండే ముసలి బైరాగి ప్రతి పదిహేను నిమిషాలకీ ఒక్కసారి అంటూ ఉంటాడు "చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ!" అని. ★

## ★ ఇల్లాలు ★

(11-వ పేజీ తరువాయి)

చేద్దామా అనిపించింది. కాని మళ్ళీతట్టింది. నేను చేసినపని తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టటం. వారింట ప్రాణం తీసుకోటం మర్యాదస్తుడైన గృహస్థుకు ప్రాణాపాయం తెచ్చిపెట్టడమే కాక, వారి వంశమర్యాదను భంగపర్చటమని భావించి వెనుదీశాను. తెల్లవారగానే గ్రామస్థుల ఎదుట నన్ను నిలదీయగలరని దృఢంగానమ్మాను దానితో శరీరం కంపించింది. తెల్లవారేలోగా ఇంచుమించు ఇరవై ముప్పైసార్లు తలుపులాగి చూచాను, కాని రాలేదు. దానితో మరింత భయపడ్డాను. తెల్లవారింది వారింట్లో కోడి ఎలుగెత్తి 'కొక్కొరోకో' అని కూసింది. అదిరిపడి మళ్ళీవెళ్ళి తలుపులాగి చూచాను. తలుపుగొళ్లెం తీసివుంది. మునసబుగారు మంచంమీద ఇంకా నిద్రపోతున్నారు. ఇలాలు దొడ్లో ఏదో ఇంటిపని చేసుకుంటోంది. నేను గాబరాపడుతూ సామాన్లు సర్దుకొని అక్కడ ఉండడానికి కిష్టంలేక వెంటనే బయలుదేరాను. అది గమనించి ఇల్లాలు వెంటనే భర్తను లేపింది. ఆయన లేవటంతో నాకు మరింత గాభరా ఎక్కువైంది. ఆయన మరోగదిలోనికి వెళ్ళి బట్టలు సవరించుకవచ్చి 'ఏమండీ అంత కంగారు పడతారెందుకు, తాపీగా స్నానంచేసి కాఫీ తాగి వెళ్ళండి' అని గృహస్థధర్మంగా అన్నాడు కాని ప్రేమపూర్వకంగా అన్న ఆమాటలతో నాకు శరీరం దహించుకుపోతున్నట్లయింది. ఎట్లాగో ముళ్ళమీద నుంచున్నట్లు వారికోరికనుమన్నించి తిరవాతవెళ్తూ 'వెళ్ళొస్తాను చెల్లెమ్మా' అన్నాను. 'వెళ్లిరాండి అన్నయ్యగారూ' అందిఇల్లాలు. నాకామాట బల్లెంతో పొడిచినట్లయింది.

వెళ్ళి వెంటనే ఆత్మహత్య చేసుకోవడం మంచిదనిపించింది. మానవ మనస్తత్వం నీకు తెలియందికాదు, నాయనా. పాతిక సంవత్సరాలనుండి ఈ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నేను చేసినతప్పు ఎవరితోనో చెప్పి పశ్చాత్తాపంపొంది దానిద్వారా కొంత మనఃస్థిమితం కలుగచేసుకుంటున్నాను. అని ఆయన కథ ముగించాడు.

అప్పట్లో ఆయనముఖం చూస్తే నాకే జాలివేసింది. ఓ విధంగా ఓదార్చకపోతే బాగుండదని మొదలుపెట్టా.

'తప్పు మానవుడు చెయ్యకపోతే మ్రాను చేస్తుందిటండీ? చేసిందానికి మీరు పశ్చాత్తాపం చెప్పుకోనే చెప్పుకుంటున్నారు. చేసినతప్పు ఈ రోజుల్లో ఎవరు చెప్పుకుంటారండీ? మీరు చేసినపాపం చెప్పుకున్నందువల్ల అప్పుడే పోయింది." అని సముదాయించేప్పటికి ఆయనముఖంలో కొంత వికాసం కన్పించింది.

"నాయనా యువకుడవు. నాకథ జ్ఞాపకముంచడం నీకూ మంచిదే నాయనా." అని చెప్పి ఆయన తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. నేను ఆలోచనలోపడ్డాను, ఆయన చెప్పిన సంఘటనలో ఆయన పడ్డ అవస్థకన్న ఆ ఇల్లాలి తెలివితేటలు, సహనం నా ఆలోచనలో ప్రథమస్థానాన్ని పొందాయి ఎంత నేర్పరితనంగా తన మానం రక్షించుకొని అతిథిని అగౌరవపర్చకుండా పంపింది! ఆడవాళ్ళందరూ అంత తెలివిగా ఉంటే ప్రపంచమే బాగుపడిపోను, అనిపించింది. ★

హకల్ బెరిఫిన్
వెల 2-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.